క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీ మృతికి నివాళి



కిష్టప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వినాయక్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నవకోటి శివ తండ్రి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప (67) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, సీనియర్ నాయకులు రమాకాంత్‌రెడ్డి తదితరులు కిష్టప్ప మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రొద్దం: మండల పరిధిలోని ఎం కొత్తపల్లి సమీపంలో ఆగి ఉన్న కారును ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తుల వివరాల మేరకు.. మంగళవారం సాయంత్రం గ్రామం నుంచి రొద్దం వైపు ద్విచక్ర వాహనంలో వస్తున్న హనుమంతరాయప్ప కుమారుడు తలారి అనిల్‌కుమార్ కారును ఢీ కొన్నాడు. చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

చింతపండు శుద్ధిపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మూర్తి

రొళ్ల: మండల పరిధిలోని కాకి గ్రామంలో మంగళవారం సాయంత్రం లక్ష్మీఖాదీ శిల్క్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ సౌజన్యంతో చింత పండు శుద్ధి ప్రక్రియపై శిక్షణ నిర్వహించారు. కేవీఐసీ రాష్ట్ర కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్‌ఎల్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకొన్న 10 మందిని కలిపి ఒక చింత పండు కర్పుడి ప్రెస్సింగ్ యంత్రాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకి వైస్ సర్పంచ్ రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, నాయకులు యర్రగుంటప్ప, తిమ్మేగౌడు, రుద్రేష్, గోవిందరాజు, రైతులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు



నాగు హోటల్‌లో ఆహారాన్ని తనిఖీ చేస్తున్న తస్లీమా

చిలమత్తూరు: మండల కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు చేశారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి తస్లీమా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హోటల్స్, బేకరీలు, చికెన్ సెంటర్లను తనిఖీ చేశారు. అనంతరం పలు హోటళ్లకు, బేకరీలు, చికెన్ కేంద్రాలకు నోటీసులు ఇచ్చారు. హానికరమైన రంగులు కలిపి ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన

రొద్దం: మండల పరిధిలోని చిన్నకోడిపల్లిలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహాల మండలి ఆధ్వర్యంలో మంగళవారం సొసైటీ సీఈఓ లావణ్య అధ్యక్షతన మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహాశక్తి సొసైటీ సీఈఓ రమీజా, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సంకష్ట హర చతుర్థి పూజలు

హిందూపురం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసనగర్, బెంగళూరురోడ్, త్యాగరాజ నగర్ శివాలయాల్లో పూజలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు.

ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నేడు బాధ్యతల స్వీకరణ



బలరామిరెడ్డిని బాధ్యతలు స్వీకరించాలని కోరుతున్న కమిషనర్

హిందూపురం: పట్టణ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బలరామిరెడ్డి బుధవారం ఉదయం 9.30 గంటలకు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మంగళవారం బలరామిరెడ్డి ఇంటికెళ్లి ప్రభుత్వ ఉత్తర్వులు ఆయనకు అందించి ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాలని కోరారు. దీంతో బలరామిరెడ్డి హిందూపురం ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. చైర్మన్ స్థానం భర్తీ అయ్యే వరకూ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ హోదాలో ఆయన అన్ని కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

సమస్యల్లో సంక్షేమం

సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు కేరాఫ్‌గా మారాయి. శిథిల భవనాలు.. ప్రమాదకరంగా పైకప్పు.. అధ్వానపు మరుగుదొడ్లు.. తదితర సమస్యలతో విద్యార్థులు వసతి గృహాల్లో విలవిలలాడిపోతున్నారు.

- నెర్రెలు చీలిన గోడలు .. అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- దోమలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- తాగునీటి సమస్యలతో అవస్థలు



హిందూపురం: ఎస్సీ బాలుర వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి



గుడిబండ: రాళ్లపల్లి బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో భారీ వర్షానికి వంటగదిలో కారుతున్న వర్షపు నీరు (ఫైల్)

హిందూపురం టౌన్: తల్లిదండ్రులకు, స్వగ్రామాలకు దూరంగా ఉంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వందల మంది విద్యార్థులు సంక్షేమ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతూ చదువులు కొనసాగిస్తున్నారు. అయితే సరైన వసతులు అందుబాటులో లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు హాస్టళ్లలో కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా సరిగా లేకపోవడంతో హాస్టల్ విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి.

800 మంది విద్యార్థులు

హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలు 11 ఉన్నాయి. వీటిలో దాదాపు 800 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో చాలా వసతి గృహ భవనాలు దెబ్బతిన్నాయి. పెచ్చులూడుతూ.. వర్షం వచ్చినప్పుడు కారుతూ.. మరుగుదొడ్లు పగిలిపోయి అధ్వానస్థితిలో ఉన్నాయి. అరకొర సౌకర్యాలతోనే విద్యార్థులు హాస్టళ్లలో ఉంటున్నారు. హిందూపురం పట్టణంలోని ముక్కడిపేటలోని బీసీ వసతి గృహంలో సీపీఐ కాలనీలో గల బీసీ బాలికల వసతి గృహం, ఎస్టీ బాలికల వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో నీటి సమస్య ఎక్కువగా ఉంది. బీసీ బాలుర వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో పందులకు ఆవాసంగా మారింది. అలాగే అపరిశుభ్రత నెలకొంది. దీంతో పాటు బయట వ్యక్తులు హాస్టల్‌లోకి వస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

దోమలకు ఆవాసం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమలలో గురుకుల, కేజీబీవీ పాఠశాల, నీలకంఠాపురం, కల్లుమర్రి బీసీ హాస్టళ్లు ఉన్నాయి. కల్లుమర్రి హస్టల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన మురుగుదొడ్లు నీరు ఉన్నా నిరుపయోగంగా ఉన్నాయి. ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించకపోవడంతో విష పురుగులు భయం వెంటాడుతోంది. దోమల బెడద కారణంలో రాత్రి సమయంలో స్థానికంగా ఉన్న విద్యార్థులు భోజనం చేసి ఇంటికి వెళ్తున్నారు. కల్లుమర్రి, నీలకంఠాపురం హాస్టళ్లల్లో కిటికీలకు మెష్ లేకపోవడంతో రాత్రి సమయంలో దోమల బెడద ఉందని విద్యార్థులు చెబుతున్నారు.

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాల గదికి అమర్చిన అద్దం పగలడంతో చల్లటి గాలి దెబ్బకు రాత్రి సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో 556 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెండు గదుల్లో ఈ సమస్య ఉంది. రత్నగిరి బీసీ సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో 91 మంది విద్యార్థులు చదువుతుండగా కాస్మొటిక్ చార్జీలు ఇవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు.

శిథిలావస్థలో వసతి గృహం

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లిలో ఉన్న బాలుర సాంఘిక సంక్షేమం వసతి గృహంలో ఏ మాత్రం వసతులు లేకుండా పోయాయి. దశాబ్దాల నాటి భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే విద్యార్థులు తల దాచుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ భవనం శ్లాబు పెచ్చులు ఎక్కడ పడతాయోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సమస్యలకు నిలయంగా వసతి గృహాలు ఉన్నాయి. విద్యార్థులకు ఉండడానికి కావలసిన మంచి గదులు, స్నానం చేయడానికి స్నానపు గదులు, మరుగుదొడ్లు వాటి సౌకర్యాలు కల్పించాలి. అలాగే అద్దె భవనాలలో నడుపుతున్న వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– బాబావలి, జిల్లా ఉపాధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ

కళాశాల హాస్టల్‌కు సొంత భవనాలు లేవు. సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

చిలమత్తూరులో..

చిలమత్తూరులో బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టళ్లలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఎస్సీ హాస్టల్‌లో 15 మంది విద్యార్థులు ఉన్నారు. డ్రైనేజీ సమస్య వల్ల దోమల వ్యాప్తి ఎక్కువవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.. బీసీ హాస్టల్‌లో నీటి సమస్య ఉంది. కిటికీలు, డోర్లు బాగోలేక దోమలతో ఇబ్బందులు తప్పడం లేదు.

విద్యార్థులకు భద్రత కరువు

పెనుకొండ: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర సంక్షేమ పాఠశాలలో భద్రత కరువైంది. పాఠశాలలో 231 మంది విద్యార్థులు (బాలురు) ఉన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల కాంపౌండ్ కూలిపోవడంతో విద్యార్థులకు భద్రత కరువైంది. ప్రధాన రహదారి పక్కనే ఎంజేపీ సంక్షేమ వసతి గృహం, పాఠశాల ఉండడంతో విద్యార్థులు రోడ్డు ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు తాము ఉతుక్కుంటున్న బట్టలకు కాంపౌండ్ కూలిపోయిన ప్రాంతంలో చెట్లకు తాళ్లు కట్టి అందులో ఆరవేసుకుంటున్నారు.



కాంపౌండ్ వాల్ లేకపోగా పిచ్చిమొక్కల మధ్య దర్శనమిస్తున్న అగళి బీసీ హాస్టల్



పెనుకొండలోని ఎంజేపీ సంక్షేమ పాఠశాలలో కాంపౌండ్ వాల్ కూలిపోగా ముళ్ల కంపలు రోడ్డు పక్కన వేసిన దృశ్యం



హిందూపురం: గోడలు నెర్రెలు చీలి కనిపిస్తున్న ముక్కడిపేట బీసీ వసతి గృహం



మడకశిర మండలం కల్లుమర్రి బీసీ హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న బాత్రూం

బీసీ హాస్టల్లో మంచి నీళ్లేవీ?

అగళి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బీసీ హస్టల్లో విద్యార్థులకు తాగడానికి మంచి నీళ్ల (ఫిల్టర్ వాటర్)లేక ఇబ్బందులు పడుతున్నారు.అలాగే ప్రహరి లేకపోవడంతో విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మధూడిలోని బీసీ హస్టల్లో విద్యార్థులకు తాగడానికి మంచి నీళ్లు (ఫిల్టర్ వాటర్) లేక ఇబ్బందులు పడుతున్నారు. కలుషిత నీళ్లు తాగి అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు అవేదనం వ్యక్తం చేస్తున్నారు.

ధైర్యంగా పనిచేయండి

- సోషల్ మీడియా సభ్యులతో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



సోషల్ మీడియా సభ్యులతో ఈరలక్కప్ప

మడకశిర: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు ధైర్యంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. మంగళవారం పట్టణంలోని మడకశిర మండలంలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సోషల్ మీడియా సభ్యులను వేధిస్తోందన్నారు. ఇప్పటికే ఎంతో మంది సోషల్ మీడియా సభ్యులపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసిందన్నారు. సోషల్ మీడియా సభ్యులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ కమిటీలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. భయపడకుండా ప్రభుత్వ తప్పులను ఎండగట్టాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ మధుసూదన్, మడకశిర రూరల్ కన్వీనర్ హరిప్రకాష్‌రెడ్డి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ



సత్తా చాటిన విద్యార్థినులతో సిబ్బంది



లేపాక్షి: ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ వైఎస్సార్ జిల్లాలోని ఇప్పట్లలో మూడు రోజుల పాటు జోనల్ స్థాయిలో క్రీడా పోటీలు జరిగాయి. ఇందులో గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. డిస్కస్ త్రో విభాగంలో వి. స్వప్న ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో ఎస్. కోవెల ప్రథమ స్థానంలో గెలుపొందారు. ఖోఖో విభాగంలో ఎం.వరలక్ష్మి బృందం విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి, పీడీ.రోజా, పీఈటీ. భాగ్యమ్మ తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు. మంచి శిక్షణ ఇచ్చిన పీడీ, పీఈటీలను అభినందించారు.

లేపాక్షి: వైఎస్సార్ జిల్లాలోని గండి క్షేత్రంలో ఈనెల 15వ తేదీన జరిగిన జోన్-4 గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో లేపాక్షిలోని నాయనిపల్లి వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ మధుసుదన్‌రావు తెలిపారు. జావెలిన్‌త్రో పోటీల్లో జోనల్ లెవెల్ కింద మొదటి స్థానం, చెస్ జూనియర్స్‌లో జోనల్ లెవెల్ రన్నర్స్‌గా, లాంగ్‌జంప్‌లో జోనల్ లెవెల్ కింద రెండో స్థానం సాధించారన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం



రత్నగిరిలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

రొళ్ల: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పెనుకొండ ఆర్డీఓ టీ.ఆనంద్‌కుమార్ తెలిపారు. మంగళవారం రత్నగిరిలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అపార్ ప్రక్రియను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వివిధ సమస్యలపై 205 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి, ఎంఈఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లులో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అధికారులు వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి , ఆర్ఐ మహమ్మద్‌బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆర్డీఓ ఆనంద్ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం గ్రామ సచివాలయంలో మంగళవారం భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్‌కు రైతులు అర్జీలను అందజేసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదు తప్పనిసరి

చిలమత్తూరు: ప్రతి విద్యార్థికి అపార్ నమోదు తప్పనిసరిగా చేయించాలనిడీఐఈఓ రఘునాథరెడ్డి పలు కళాశాలల ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అపార్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

రేపు పరిగి మండల మీట్

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 21న ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ ఓ ప్రకటన తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొందిలో పగిలిపోయిన వాటర్‌స్కీమ్ పైపులైన్ మరమ్మతు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. పైపులైన్ వద్ద సింగల్‌ఫేస్ మోటార్ సాయంతో తాగునీటిని పట్టుకొంటున్నామని వాపోయారు. అయితే పైప్‌లైన్ ధ్వంసానికి కారణమైన వారితోనే మరమ్మతు పనులు చేయిస్తామని సర్పంచ్ గీత తెలిపారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయండి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని కాలనీ వాసులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, ఆచారి, శీన, ఓబులేసు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు విరాళం

లేపాక్షి: లేపాక్షిలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన బి.సదాశివరెడ్డి రూ. 25 వేలను మంగళవారం కమిటీ సభ్యులకు అందించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గుడిబండ: మండల పరిధిలోని గొల్లహట్టి, సింగేపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని ఏఓ వీరనరేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ రైతులకు సూచించారు.

మడకశిరరూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ తిమ్మప్ప తెలిపారు. మంగళవారం ఏఆర్ రొప్పం, ఆమిదాలగొంది గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

రొళ్ల: గ్రామాల్లో రేషన్ లబ్ధిదారులకు నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎఫ్‌పీ షాపుల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుడి మృతికి నివాళి

హిందూపురం టౌన్: రొద్దంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఈ మధ్యనే రోడ్డు ప్రమాదంలో మరణించిన రమేష్, ఆయన కుమార్తె భవిత ఆత్మలకు శాంతి కలగాలని దేవుడిని వేడుకుంటున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంజీఎం పాఠశాల ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు లోకనాథ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మొరార్జీ యాదవ్, సురేష్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం

పావగడ: తాలూకాలోని కోణనకుర్కె గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు సమర్పించారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో ముద్దు మల్లేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

అమరాపురం: మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏపీఎం ముత్యాలప్ప పేర్కొన్నారు. మంగళవారం స్థానిక హేమ మండల కార్యాలయంలో మహిళా సంఘాల వీఓ లీడర్లు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ముత్యాలప్ప, సీసీ లక్ష్మీనారాయణ పలు సూచనలు, సలహాలిచ్చారు.

నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఓఎంసీఏపీ, ఎస్ఎం కేర్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వడంతో పాటు ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసి 35 ఏళ్లలోపు ఉన్న వారు శిక్షణకు అర్హులన్నారు. ఎంపికైన వారికి తిరుపతిలో రెసిడెన్షియల్ డేస్కాలర్ విధానంలో జర్మనీ భాషపై 6 నెలల పాటు నాలుగు దశల్లో శిక్షణ ఇస్తారన్నారు. ప్రాథమిక ఇంటర్వ్యూలో అర్హత సాధించిన వారికి జర్మనీలో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, నాలుగు ఫొటోలు, జనన ధృవీకరణపత్రం, అనుభవ ధృవీకరణ పత్రం, వివాహ ధృవీకరణ పత్రం, నోటరీ, నర్సింగ్ కౌన్సిలింగ్ కోవిడ్ సర్టిఫికెట్లతో ఈ నెల 23వ తేదీ లోపు www. skillinternational@apsdc. in కు మెయిల్ చేయాలన్నారు. మరిన్ని వివరాలను స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కే.శివప్రసాద్ ఫోన్ నంబర్: 9676706976ను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



శోభారాణి

లేపాక్షి: మండలంలోని పులమతి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బి.శోభారాణికి పద్మావతి మహిళా విశ్వవిద్యాయం వృక్షశాస్త్రం విభాగం నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ పి.సుజాతమ్మ, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రభాకర్‌రాజు పర్యవేక్షణలో 'ట్యాక్సానమిక్ ఇన్వెస్టిగేషన్ ఆన్ ఫ్రెష్ వాటర్ ఆల్గే ఇన్ కర్నూల్ డిస్ట్రిక్ట్' అనే అంశం మీద చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది.

జూదరుల అరెస్టు

గోరంట్ల: మండల పరిధిలోని చౌండూరివాండ్లపల్లి సమీపంలో మంగళవారం జూదమడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,600 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



కదిరేపల్లిలో జ్యోతులు మోస్తున్న భక్తులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లిలో కసుమ మారెమ్మ, గౌడసంద్రమారెమ్మ దేవతలకు కార్తీక మంగళవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన రొద్దకాంబదేవికి మంగళవారం కర్ణాటక రాష్ట్రం మధుగిరి ప్రాంతానికి చెందిన అమ్మవారి భక్తులు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.